క్లుప్తంగా

గ్రామస్తుల్లో సోదరభావం ఉండాలి

డీఎస్పీ భానోదయ



రేటూరు (కాకుమాను): గ్రామాల్లో ప్రజలందరూ సోదరభావం కలిగి ఉండాలని ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేటూరులో మంగళవారం రాత్రి చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేని పోని గొడవలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోరాదని తెలిపారు. డ్రగ్స్, గంజాయి, వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, కాకుమాను ఎస్ఐ ఏకనాథ్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఎఫ్–1 పరీక్షలకు సిద్ధం చేయండి

ఎంఈవో కెన్నడీ



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ఎఫ్–1 పరీక్షలకు సిద్ధం చేయాలని మండల విద్యాశాఖ అధికారి కె.ఎఫ్ కెన్నడీ అన్నారు. పెదనందిపాడు మండలంలోని నాగులపాడు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ సోమ వారం నుంచి ఎఫ్–1 పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తరగతిలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యలో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల ప్రగతి వివరాలను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్ఎం మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలి

తహసీల్దార్ వెంకట స్వామి



కాకుమాను: గ్రామాల్లో రెవెన్యూ అధికారులు రైతుల నుంచి నీటి తీరువా వేగవంతం చేయాలని తహసీల్దార్ వెంకట స్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గ్రామ రెవెన్యూ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి తీరువా, రైస్ కార్డులు, సీసీఆర్సీ కార్డులు, జనన, మరణ, ధృవీకరణ పత్రాల వివరాలను వెబ్ లాండ్‌లో పొందు పరచాలన్నారు. అన్నదాత సుఖీభవ వర్తించని రైతుల వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి విచారణ నిర్వహించి వారికి రైస్ కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. సీసీఆర్సీ కార్డులు మండలానికి 2900 టార్గెట్ కాగా ఇప్పటి వరకు కేవలం 1432 కౌలు రైతులకు మాత్రమే కార్డులు మంజూరు చేసినట్లు మిగిలిన కౌలు రైతులకు కూడా కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివాలయంలో నిత్యాన్నదాన పథకానికి మంగళగిరి పట్టణానికి చెందిన పలగాని నరసింహారావు శివనాగేశ్వరమ్మ దంపతులు బుధవారం ఆలయ డిప్యూటీ కమీషనర్ గోగినేని లీలాకుమార్‌కు 50 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిత్యాన్నదాన పథకానికి భక్తులు సహాయ సహకారాలు అందించి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. దాతలు పలగాని నరసింహారావు దంపతులకు స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే వేదాశీర్వచనం చేయించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు

చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలి

- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- జడవల్లి, మామిళ్లపల్లిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



పోస్టరును ఆవిష్కరించిన అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసం చేసిన సీఎం చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చతికిలపడిందన్నారు. బుధవారం మండలంలోని జడవల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేశారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్‌కోడ్ కరపత్రాలను పంపిణీ చేశారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యువజన అధ్యక్షులు చుండూరు వీరయ్య, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షులు నల్లమోతు రవీంద్రబాబు, పెన్షనర్స్, ఎంప్లాయిస్ అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్. మౌలాలి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు బోయ ప్రవీణ్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె. మరియా రాణి, సర్పంచి బుడేఖాన్, నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, పిల్లి మాణిక్యరావు, దేవరకొండ గోపి, మూర్తి రాజు, గోవర్ధన్, సుశోభిత, లంకపోతు పిచ్చిరెడ్డి, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులే

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో ఏఐసీటీఈ ఇండక్షన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శేఖర్, విద్యార్థులు

గుంటూరు రూరల్: అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులేనని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు. బుధవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఏఐసీటీఈ ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక యుగంలో నెలకొన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాథమిక దశ నుండే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, నైతిక విలువలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీం వర్క్ అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధన చేరువ దిశగా, ప్రారంభంలోనే తగిన ప్రణాళికను రూపొందించుకోవాలని, నిత్యం సాంకేతిక రంగం వేగం పుంజుకుంటున్నదని, సమయాన్ని వృధా చేయకుండా విద్య పైనే శ్రద్ధ చూపాలన్నారు. ప్రపంచ దేశాలు మెచ్చే భావి భారత నిర్మాణానికి విద్యార్థులు నూతన నాంది పలకాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. విద్యతో పాటూ విద్యార్థులు శారీరక మానసిక శక్తిని పెంచుకునేందుకు క్రీడలకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా, సమాజంలో కీర్తి ప్రతిష్టలతో అందరి మన్ననలు పొందే విధంగా తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేట్ టీచర్ అవార్డులకు దరఖాస్తులకు ఆహ్వానం

పెదకాకాని(ఏఎన్‌యూ): వర్సిటీ నుంచి 2025 సంవత్సరమునకు గాను యూనివర్సిటీ టీచర్లు స్టేట్ బెస్ట్ టీచి అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్, సెక్రటరి(ఎఫ్ఏసి) టివి శ్రీకృష్ణ మూర్తి వర్సిటీలకు లేఖ వంపారు. ఫ్యాకల్టీల వారీగా స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులకు దరకాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తులను వర్సిటీ నుంచి దరఖాస్తుల చేసుకునేందుకు ఆఖరు తేదీ లేఖలో పేర్కొన్నారు. వర్సిటీలో ఆయా అభ్యర్థుల జాబితాలను ఈనెల 21లోగా ఉన్నత విద్యామండలి కార్యాలయానికి అందేలా వంపాల్సి ఉంది. మొత్తం 16 విభాగాల్లో 42 అవార్డులను అందజేయనున్నారు.

ఏఎన్‌యూలో కలరిపట్టుపై కళాత్మక శిక్షణ

పెదకాకాని (ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని థియేటర్ ఆర్ట్స్ విభాగం, యడ్లపాడు వేదిక నాటక విభాగాలు సంయుక్తంగా వారం రోజుల కలరిపట్టుపై కళాత్మక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. థియేటర్ ఆర్ట్స్ విభాగంలో డాక్టర్ ముత్తవరకు సురేష్ బాబు కళావేదికపై ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కలరిపట్టు అంటే కేరళ రాష్ట్రం యొక్క యుద్ధ విద్య. దీనిపై ఈ శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. శిక్షకులుగా కర్ణాటక నుంచి ఉదయకుమార్, ఏపీ నుంచి కుంగ్ ఫూ ఫణీంద్ర, తమిళనాడు నుంచి డాక్టర్ రూపలు వ్యవహరిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా బెంగళూరు చాప్టర్ డైరెక్టర్ వీణ శర్మ, సుశీల్ శర్మ, వేదిక థియేటర్ నుంచి డాక్టర్ ముత్తవరపు సురేష్బాబు, వరగాని నాగేశ్వరరావు, పద్మారావులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో యుద్ధవిద్య ఆవశ్యకతలో నటుడు పూర్తిస్థాయిగా తన శరీరాన్ని మలుచుకునేందుకు ఈ శిక్షణా ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కలరిపట్టు శారీరక అభ్యాసాల ప్రదర్శనలు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య ఎల్‌వీ భూషణరావు మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు 20 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందన్నారు. తరగతుల నిర్వహణకు తాత్కాలిక వీసి ఆచార్య కె.గంగాధరరావు పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు.

పంటల బీమా గడువు పొడిగించారు

గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. మోహన్‌రావు



రైతులతో మాట్లాడుతున్న మోహన్‌రావు

ప్రత్తిపాడు: పంటల బీమాకు ప్రభుత్వం గడువును పొడిగించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. మోహన్‌రావు అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో షేక్ సుగుణ భేగం వ్యవసాయ సిబ్బందితో కలిసి ఏడీఏ రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శించారు. అనంతరం స్థానిక రైతు సేవ కేంద్రంలో పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎస్.మోహన్‌రావు మాట్లాడుతూ వరి, మినుము, మిరప పంటలకు పంటల బీమా తేదీని ఆగస్టు 14వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఎన్ఎఫ్ఎస్ఎం పథకం ద్వారా రైతులకు నూరుశాతం రాయితీపై మినుము విత్తనాలను అందిస్తున్నామన్నారు. కావలసిన రైతులు రైతు సేవ కేంద్రాలను సంప్రదించాలని చెప్పారు. ఏవో సుగుణబేగం మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ సర్వేలో పాల్గొనాలన్నారు. అనంతరం ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది బీజామృతం తయారీ విధానం, పంటల్లో పిచికారీ చేసే పద్ధతులను రైతులకు వివరించారు. ఎంపీఈవో అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టించవద్దు

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని వ్యవసాయ ల్యాబ్‌లో బుధవారం ఏవో సుగుణ బేగం ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లుతో సమావేశాన్ని నిర్వహించారు. హాజరైన ఏడీఏ ఎస్.మోహన్‌రావు మాట్లాడుతూ ఆయా దుకాణాల నిర్వాహకులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయించడం వంటివి చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యత

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



అంబటి మురళీకృష్ణకు వినతిని అందిస్తున్న మస్తాన్‌వలి

పట్నంబజారు: అనుబంధ విభాగాల కమిటీ ఏర్పాటులో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రాధాన్యత కల్పిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి బుధవారం గుంటూరులోని ఆయన నివాసంలో అంబటిని కలిశారు. త్వరితగతిన అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ జెండాను భుజాన పెట్టుకుని పాటు పడిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని చెప్పారు. పొన్నూరు నియోజకవర్గంలో అనుబంధ విభాగాలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ అనుబంధ విభాగాల ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ జిల్లా అధ్యక్షులు, నగర, పట్టణ అధ్యక్షులను కలిసి విన్నవిస్తున్నట్లు తెలిపారు.

చలపతిలో పారిశ్రామిక విద్యా ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న యాజమాన్యం, సంస్థ ప్రతినిధులు

గుంటూరు రూరల్: చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, కేరళ రాష్ట్రానికి చెందిన పాలక్కాడ్లోని ఆస్పైర్ టెక్ పార్క్ మధ్య పరిశ్రమ విద్యా పరస్పర సహకారానికి గుర్తింపుగా ఒక ముఖ్యమైన ఒప్పంద నిర్ణయం కుదుర్చుకోవటం ఎంతో సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఆస్పైర్ టెక్ పార్క్ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ లావణ్యశ్రీతో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు అనేక రంగాల్లో మౌలిక, శాస్త్రీయ సాంకేతిక సహకారం లభిస్తుందన్నారు. సంయుక్తంగా సెమినార్లు, వెబినార్లు, సదస్సులు, ఇంటరాష్షిప్స్, శిక్షణా శిబిరాలు నిర్వహించుకోవటం, ఆధునిక పరికరాల ద్వారా ఔషధ విశ్లేషణలు, బయోలాజికల్ నమూనాల్లో డ్రగ్ మిగులు మోతాదుల అంచనా వంటి పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సంయుక్తంగా పరిశోధన వ్యాసాలు, పేటెంట్లు, పుస్తకాలు ప్రచురించడంతో పాటు, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు, ప్రయోగశాలల అభివృద్ధి, కొత్త కోర్సుల రూపకల్పన వంటి విద్యా ఆధారిత కార్యక్రమాలను అమలు చేయనున్నట్టు ఇరు సంస్థలు స్పష్టం చేశాయి. ఐదేళ్ల పాటు అమలులో ఉండనున్న ఈ ఒప్పందం పరిశ్రమ విద్యా రంగాల మధ్య ఉన్న అనుసంధాన ఖాళీని తగ్గిస్తూ, శాస్త్రీయ అభివృద్ధికి బలమైన పునాది వేసే అవకాశముందని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం విద్యా పరిశ్రమల మధ్య దృఢమైన అనుసంధానానికి దోహదం చేస్తూ, విద్యార్థులకు అనుభవాధారిత జ్ఞానాన్ని అందించే దిశగా కీలక ముందడుగుగా నిలవనుందన్నారు. పరిశోధన, శిక్షణ, ఆవిష్కరణల పరంగా ఇరు సంస్థలు పరస్పర సహకారంతో ప్రయోజనాన్ని సాధించనున్నాయి. ఈ కార్యాచరణ ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నైపుణ్యాలను సాధించి, పరిశ్రమకు మరింత దగ్గరయ్యే అవకాశాన్ని పొందనున్నారు. ఈ ఒప్పందం బహుళ ప్రయోజనాలకు వేదికగా మారి, సమాజానికి ఉపయోగపడే పరిజ్ఞానాన్ని రూపుదిద్దే పునాది కావాలని ఇరు సంస్థలు ఆశాభావం వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం పాల్గొన్నారు.

యువత.. సమయాన్ని వృథా చేసుకోవద్దు

- ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీ బి. రాజకుమారి
- 'మలినేని'లో ఘనంగా బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న ఐజీ బి. రాజకుమారి



విద్యార్థిని నృత్య ప్రదర్శన

ప్రత్తిపాడు: యువత మొబైల్స్, సోషల్ మీడియాకు అలవాటు పడి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఏపీఎస్‌పి బెటాలియన్ ఐజీ బి. రాజకుమారి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 20252–26 విద్యాసంవత్సరానికి సంబంధించి బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఇండక్షన్ ప్రోగామ్ స్థానిక కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీఎస్‌పీ బెటాలియన్ ఐజీ బి. రాజకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్స్, సోషల్ మీడియాకు బానిసలైతే విద్యపై పట్టు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉండటం మంచి విషయమేనని, అయితే దానిని వ్యసనంగా మార్చుకోవద్దన్నారు. ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా తమ ప్రయాణం సాగించాలని సూచించారు.

మలినేని కళాశాలల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ కళాశాల ఒక విద్యా గంగ అని తెలిపారు. ఇక్కడ విద్యార్థులు నైపుణ్యాలు, విలువలు, పరిశోధనలు, ఆచరణాత్మక జ్ఞానం పొందే అవకాశాలు విస్తృతంగా ఉంటాయన్నారు. ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, హ్యాకథాన్‌లు, ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులు, ఇన్నోవేషన్ ప్రయోగాల్లో తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు విజయాలు సాధించారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మార్చి నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా చేస్తుందన్నారు. ప్రిన్సిపల్ డా.జె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లు, సమయపాలన, నైతిక విలువలు, క్రమశిక్షణ అలవరుచుకుని చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంపై ఆసక్తి చూపాలన్నారు. విద్యార్థినులు చేసిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో అడ్మిషన్స్ డీన్ డాక్టర్. పోపూరి రమేష్ బాబు , అకడమిక్ డీన్ జంపని కిషోర్ బాబు, ఆయా విభాగాల డీన్లు, హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనధికార కట్టడాలు, లే అవుట్స్‌పై కఠిన చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అనధికార కట్టడాలు, లే అవుట్స్, హోర్డింగ్స్, ట్యాప్‌లు 48 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో జీఎంసీ సిబ్బందే తొలగిస్తారని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తొలగింపు ఖర్చుతో పాటు అపరాధ రుసుం కూడా విధిస్తామని స్పష్టం చేశారు. ఆయన బుధవారం శారదా కాలనీ, సంజీవయ్య నగర్, కేవీపీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనధికార కట్టడాలపై పట్టణ ప్రణాళిక అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ నుంచి అధీకృత ప్లాన్, అనుమతి లేకుండా అనధికార నిర్మాణాలు, లే అవుట్లు ఏర్పాటు చేసిన వారు 48 గంటల్లోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆదేశించారు. చాలా ప్రాంతాల్లో అనధికార మున్సిపల్ కుళాయిలు కూడా ఉన్నాయని వాటిని తొలగించుకోవాలని తెలిపారు. నగరంలో రోడ్లు, డ్రైయిన్లు ఆక్రమించుకొని ట్రాఫిక్, మురుగు పారుదలకు సమస్యలు సృష్టిస్తున్న వారు తక్షణమే ఆక్రమణలు తొలగించుకోవాలని ఆయన చెప్పారు. వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా బకాయిలు చెల్లించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కూడా సర్వీస్ చార్జీల బకాయిలు చెల్లించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల అధికారులతో సర్వీస్ చార్జీల వసూళ్లపై అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని సౌత్ సెంట్రల్ రైల్వే, పోస్టల్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కంటాక్స్, మిలటరీ, నెహ్రూ యువ కేంద్రం, స్పైసెస్ బోర్డ్, సీటీఆర్ఐ స్టేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు 141 అసెస్‌మెంట్ల ద్వారా సుమారు రూ.36 కోట్లు సర్వీస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపు కోసం నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులను డిపార్ట్‌మెంట్ల వారీగా షెడ్యూల్ కేటాయించాలని అదనపు కమిషనర్‌కు తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే డిమాండ్ నోటీసులు ఇచ్చామని, అందులో ఏమైనా సందేహాలు ఉంటే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైన వాటిని రీ అసెస్ చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకిచ్చిన హామీలు అమలు చేయాలి

- మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో ఆటో కార్మికులను ఆదుకోవాలి
- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ



మాట్లాడుతున్న శివాజీ

ప్రత్తిపాడు: ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి హామీలను అమలు జరపాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్టిడబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మారుతి థియేటర్ ఆవరణలో బుధవారం సీఐటీయూ అనుబంధ ఆటో వర్కర్స్ సమావేశం నిర్వహించారు. కె.కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా నన్నపనేని శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ జీవో నంబర్ 21తో ఆటోరంగ కార్మికులకు పెద్ద ఎత్తున ఫీజులు, అపరాధ రుసుములు విధిస్తున్నారని మా ప్రభుత్వం అధికారంలోకి జీవోను సవరించి ఫీజులు, పెనాల్టీలు తగ్గిస్తామని చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా జీవోపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. వీటికి తోడు పెట్రో, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడంతో డ్రైవర్ల జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న ట్యాక్సులు ఆటో రంగ కార్మికులకు పెనుభారంగా మారాయని తెలిపారు. గతంలో ఆటోలు, రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ టెస్టులు నేరుగా ప్రభుత్వమే నిర్వహించేదని, కానీ నేడు ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ పేరుతో ప్రైవేటు వారికి అప్పగించి డ్రైవర్లపై అధిక ఆర్థిక భారాలు మోపుతున్నాయని మండిపడ్డారు.

కిస్తీలు కట్టలేక ఇబ్బందులు..

ఇప్పటికే ఆటో డ్రైవర్లు ఆశించిన స్థాయిలో కిరాయిలు లేక నెలవారీ కిస్తీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారని శివాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేయనున్న ఉచిత బస్సు పథకం అమలు జరిగితే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు. ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని, పథకాన్ని అమలు జరిపే క్రమంలో ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్లును కూడా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. జీవో నెంబర్ 21 రద్దు కోసం భవిష్యత్‌లో ఆందోళన చేపడతామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, ప్రత్తిపాడు సీఐటీయూ నాయకులు కె.ఆదినారాయణ, ఆటో యూనియన్ నాయకులు గాలి నాగరాజు, ప్రసాద్, శ్రీకాంత్, రంగనాయకులు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జీవీఆర్ఎస్ కళాశాలలో హ్యాకథాన్ ప్రోగ్రాం



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్ : మండలం లోని బుడంపాడు గ్రామం లోగల జీవి ఆర్ ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో హ్యాకథాన్ బుధవారం ఘనంగా నిర్వహించారు. టెక్ ఫైల్ సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానంగా వెబ్ డెవలప్మెంట్, ఏఐ టూల్స్ గురించి ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ అందించారు. హ్యాకథాన్ ఉద్దేశాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భాస్కర్ నాయుడు, డీన్ డాక్టర్ బి. వరప్రసాద్, టెక్ ఫైల్ ప్రతినిధి వై.రవివర్మ విద్యార్థులకు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, పోటీ ప్రపంచం నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యం పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు . హ్యాకథాన్ అనేది కేవలం పోటీ కాదు ఇది ఒక అభ్యాస వేదిక అని అన్నారు. ఛైర్మన్ డాక్టర్ ఎన్. సింధూర, డైరెక్టర్ షేక్ కరిమున్నీసా సారధ్యంలో నిరంతరం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు దివ్యౌషధం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. భారతి



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఎస్. భారతి

ప్రత్తిపాడు: తల్లిపాలు బిడ్డకు దివ్యౌషధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. భారతి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం ప్రత్తిపాడు సెక్టార్‌లోని యనమదల డీడబ్ల్యూ సెంటరులో, గొట్టిపాడు డిడబ్ల్యూ–1, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గృహాలను సందర్శించారు. నవజాత శిశువుల సంరక్షణతో పాటు తల్లిపాలు ఇచ్చే పద్ధతులపై వివరించారు. బిడ్డ పుట్టిన రోజు నుండి 28 రోజుల వరకు నవజాత శిశువులను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న తల్లులు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు ఎస్.భారతి, పి. మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.